క్లుప్తంగా

పశు సంవర్ధక అధికారుల సంఘం కార్యదర్శిగా గంగాధర్


సీహెచ్ మధు మురళీ గంగాధర్

యలమంచిలి రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల సేవా సంఘం జనరల్ సెక్రటరీగా యలమంచిలి పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ చల్లా మధు మురళీ గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం పశుసంవర్ధక జేడీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో గంగాధర్‌ను సంఘం కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల సోమవారం యలమంచిలి పశుసంవర్ధక ప్రాంతీయ ఆస్పత్రిలో పలువురు పశు వైద్యాధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. సంఘం బలోపేతానికి, పశు సంవర్ధక శాఖ అధికారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్టు గంగాధర్ సాక్షికి తెలిపారు.

'అన్నదాత సుఖీభవ'కు వివరాల సేకరణ

మునగపాక: అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతుల వివరాలు సేకరిస్తున్నామని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి గైడ్‌లైన్స్ విడుదల చేసిందన్నారు. అర్హులైన రైతులంతా సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రైతుకు సంబంధించిన లేటెస్ట్ వన్‌బీ, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పుస్తకంలోని తొలిపేజీతో కూడిన జెరాక్స్‌ను తీసుకువచ్చి అధికారులకు అందించాలన్నారు. ఈ నెల 20వ తేదీలోగా వివరాలు అందించాలని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు గాయాలు


గాయపడిన కోటి

మునగపాక: మండలంలోని గంగాదేవిపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. టి.సిరసపల్లికి చెందిన పాలమరిశెట్టి కోటి సోమవారం తన బైక్‌పై మునగపాక మీదుగా అనకాపల్లి వెళ్తున్నాడు. గంగాదేవిపేట జంక్షన్ సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించబోయి బైక్ బోల్తా పడింది. దీంతో కోటి కిందపడిపోయి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో ఆయనను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా కృషి చేస్తున్నామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలు ఉంటే ఈ కార్యక్రమం దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని అర్హతలు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈవోఆర్డీ సోమరాజు, మండల ఇంజినీరింగ్ అధికారు గులామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, హౌసింగ్ ఏఈ రాము, వెలుగు ఏపీఎం బాలరాజు, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాయకరావుపేట పీహెచ్‌సీలో తనిఖీలు


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డీఎంహెచ్‌వో బాలాజీ

పాయకరావుపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సీడీ సర్వే, ఈసీ సర్వే, టీబీ, హెచ్‌ఐవీలపై సమీక్ష నిర్వహించారు. ఎండలు కారణంగా వడదెబ్బ, అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల పట్ల జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్, ఈవో పి.వి.రమణ, హెచ్‌ఎస్ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- అసహజ పద్ధతుల్లో మామిడి పండ్ల పక్వం
- ప్రజారోగ్యంతో వ్యాపారుల చెలగాటం
- తనిఖీలు విస్మరించిన అధికారులు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు


యలమంచిలిలో విక్రయానికి ఉంచిన మామిడి పండ్లు

తీయని విషం..!


పట్టణంలో ప్రధాన రహదారి పక్కన విక్రయిస్తున్న కృత్రిమంగా మగ్గబెట్టిన మామిడి పండ్లు


రసాయనాలను చల్లి కేట్లలో ఉంచిన మామిడి కాయలు

యలమంచిలి రూరల్: జిల్లాలో మామిడి వ్యాపారం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. ఎండా కాలంలో నోరూరించే మామిడి పండ్లను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతారు. అయితే కాయలు త్వరగా పండ్లు కావాలనే ఉద్దేశంతో కొంతమంది వ్యాపారులు రసాయనాలతో మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. వ్యాపారుల స్వార్థంతో మధురఫలం విషతుల్యమవుతోంది. యలమంచిలి పట్టణంలో ఎక్కడ చూసినా కాల్షియం కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లే కనబడుతున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని పండ్ల దుకాణాల్లో మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రధాన రహదారి పక్కన మామిడి పండ్ల అమ్మకాల కోసం ప్రత్యేకంగా దుకాణాలు సైతం వెలిశాయి. ఈ దుకాణాల వద్ద కేట్లతో మామిడి పండ్లు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి డజన్ల లెక్కన విక్రయిస్తున్నారు. ఇక్కడ విక్రయిస్తున్న మామిడి పండ్లు పక్వానికి రాక ముందే తెంపి కార్బైడ్‌తో మగ్గబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. కృత్రిమ పద్ధతుల్లో పండించిన మామిడి పండ్లు పసుపువర్ణంలో నిగనిగలాడుతూ కన్పిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసి తింటున్న జనం అనారోగ్యం బారిన పడుతున్నారు.

అంతా విషతుల్యం..

గతంలో పండ్లు సాధారణ పద్ధతుల్లో మగ్గబెట్టేవారు. జనాభా పెరుగుదల, పండ్ల వినియోగం పెరగడంతో కృత్రిమ పద్ధతుల్లో మగ్గబెట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు వ్యాపారులు. కాల్షియం కార్బైడ్ వినియోగం వల్ల జీర్ణకోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడంలేదు. మామిడి సహా నేడు మార్కెట్లో దొరికే అన్ని పండ్లు కృత్రిమ పద్ధతుల్లోనే మగ్గబెడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆహార కల్తీ నియంత్రణ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయకపోతే మార్పు వచ్చేలా కనిపించడంలేదు.

రసాయనాలతో 24 గంటల్లోనే..

తియ్యని మామిడి పండ్ల వెనుక విషతుల్యం దాగి ఉంది. మామిడి కాయలను చెట్టు పైనే పక్వానికి వచ్చే వరకు ఉంచితే సహజసిద్ధమైన తీపిగా ఉంటాయి. కానీ వ్యాపారులు పక్వానికి రాకుండానే పచ్చి కాయలను తోటల నుంచి మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. కాల్షియం కార్బైడ్, ఇథిలీన్‌లని వినియోగించి కాయలు 18 నుంచి 24 గంటల్లో పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. అరటి, సపోట, బొప్పాయి వంటి పండ్లను కూడా రసాయనాలతో మగ్గబెడుతున్నారు. వీటిని తింటే రోగాల బారిన పడక తప్పదని, మగ్గబెట్టిన పండ్లను కాకుండా సహజ సిద్ధమైన పండ్లను మాత్రమే తిని ఆరోగ్యంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

మగ్గబెట్టిన పండ్లను గుర్తించండిలా..

మామిడి, అరటి పండ్లను మగ్గబెట్టడానికి వ్యాపారులు ఎక్కువగా రసాయనాలను వినియోగిస్తున్నారు. కార్బైడ్, ఇథిలీన్‌తో మగ్గబెట్టిన పండ్లను గుర్తించడానికి నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.

- మగ్గబెట్టిన పండ్లు ఎక్కువ పసుపు వర్ణంలో ఉంటాయి. వీటిని తినేటపుడు నోట్లో కొంచెం మంట, కడుపులో నొప్పి, గొంతు నొప్పి మొదలవుతుంది.
- కృత్రిమంగా పండే పండ్లు మొత్తం ఒకే విధమైన రంగును కలిగి ఉంటాయి. పైకి పండినట్టు కనిపించినా లోపల రుచిలో తేడా ఉండి చప్పగా, పుల్లగా ఉంటాయి.
- సహజంగా పండే పండ్ల నుంచి వచ్చే వాసన బట్టి వాటిని గుర్తించవచ్చు. కృత్రిమంగా పండిన పండ్ల నుంచి వాసన ఏమాత్రం రాదు.
- పండ్లను తిన్న తర్వాత డయేరియా సమస్యకు గురైతే కాల్షియం కార్బైడ్, ఇథిలీన్ వాడినట్లు గుర్తించాలి.
- సహజ సిద్ధంగా మగ్గిన పండ్లపై ఆకుపచ్చ మచ్చలు, పసుపు రంగు కనీ, కనిపించినట్టుగా ఉంటుంది. పండును కోసినప్పుడు లోపల గుజ్జు ఎరుపు, పసుపు రంగు కలిసినట్టు ఉంటుంది. ఈ పండ్లలో రసం ఎక్కువగా ఉంటుంది.

రసాయన పండ్లను తినొద్దు



రసాయనాలను ఉపయోగించిన పండ్లు తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వినియోగదారులు శ్రేష్ఠమైన, సహజసిద్ధంగా పండే మామిడి పండ్లను తినాలి. నిషేధిత పదార్థాలు వాడి మగ్గబెట్టిన పండ్లను గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. సీజన్‌కు ముందొచ్చే పండ్లను తినడం మంచిది కాదు. బహిరంగ మార్కెట్లో పండ్లను కొని తినే ముందు ఉప్పు నీటిలో 20 నిమిషాలు ఉంచి తిరిగి మంచినీటితో శుభ్రంగా కడిగి అనంతరం తొక్కతీసి తినడం మంచిది.

– డాక్టర్ ఎస్.సంతోష్ కుమార్, కమలా హాస్పటల్, యలమంచిలి

మసీదు ఉస్మాన్ ఘని నూతన కార్యవర్గం ఎన్నిక


మసీదు నూతన కార్యవర్గం

కోటవురట్ల: మసీదు ఉస్మాన్ ఘని కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికల ముఖ్య పర్యవేక్షకుడిగా జనాబ్ పాచ్చా సాహెబ్ వ్యవహరించి కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా మహమ్మద్ గౌస్‌లాజం, ఉపాధ్యక్షుడిగా ఆలీ అహ్మద్, కార్యదర్శిగా మస్తాన్, సంయుక్త కార్యదర్శిగా కరీం, కోశాధికారులుగా మదీనా వల్లీ, బషీర్, కమిటీ సభ్యులుగా జానీ, సుభానీ, ఇమామ్ బాషా, బషీర్, నాగూర్, సిలార్, సలహాదారులుగా పీర్ అహ్మద్, పాచ్చా సాహెబ్, అబ్బు ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మసీదుకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు అల్లాహ్‌కు రుణపడి ఉంటామన్నారు.

'అన్నదాత సుఖీభవ' కోసం పేర్లు నమోదు చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏవో ఉమాప్రసాద్

నక్కపల్లి: అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ కోరారు. సోమవారం ఉద్దండపురంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వెబ్‌ల్యాండ్‌లో పేర్లు కలిగిన రైతులంతా తమ వివరాలను అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో కూడా నమోదు కావాల్సి ఉందన్నారు. తదుపరి వీఆర్వో, తహసీల్దార్ లాగిన్ ద్వారా ఈ వివరాలను ధ్రువీకరించనున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


చినదొడ్డిగల్లులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ

నక్కపల్లి: నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలంటూ ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. సోమ వారం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఏడిద వెంకటరమణ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తుని, పాయకరావుపేట పట్టణాల్లో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న గ్రామానికి చెందిన సుమారు 50 మంది ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వగా.. సుమారు 10 మంది పిల్లలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేరేందుకు అంగీకారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏ కోర్సులు చదివితే బాగుంటుంది, ఏ కళాశాలల్లో చదవాలి అనే విషయాలను తెలియజేసినట్టు వెంకటరమణ తెలిపారు.

అమర్‌నాథ్‌కు నేతల శుభాకాంక్షలు


అమర్‌నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన గుడివాడ అమర్‌నాథ్‌ను పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, పార్టీ పాయకరావుపేట మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అనకాపల్లిలో బాధ్యతలు చేపట్టిన అమర్‌నాథ్‌ను సోమవారం వారు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, గెద్దమూరి నీలవేణి శ్రీనివాసరావు, వంగలపూడి సరస్వతీ రామారావు, పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు వెంకటేశ్వర్లు, చేపల తాతాజీ, పెనుమత్స నాగేశ్వరరావు, దేవవరపు నాగభూషణం, నర్సింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు


ఎంఆర్‌సీ భవనానికి చేరుకున్న పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక: స్థానిక ఎంఆర్‌సీ భవనానికి సోమవారం 2025–26 సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. సంబంధిత పుస్తకాలను జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బి.శకుంతల పరిశీలించారు. 70 శాతం మేర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 30 శాతం పుస్తకాలు రావాల్సి ఉందని ఆమె తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలు అందించామని, తేడాలు సరిచూసుకోవాలని ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు కర్రి లక్ష్మీనారాయణ, అచ్యుతకృష్ణ, ఆర్.సత్తిబాబు, ఎం.గోవిందు, పి.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం మంచి అలవాటు


కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


పాయకరావుపేట గ్రంథాలయంలో గీసిన చిత్రాలతో చిన్నారులు

కోటవురట్ల: పుస్తకాలు చదవడం మంచి అలవాటని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ సెల్‌ఫోన్ జోలికి పోకుండా పుస్తకాలతో స్నేహం చేయాలన్నారు. మంచి పుస్తకాలు మంచి స్నేహితులుగా మారతాయని, తద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడుతుందన్నారు.

05వైఎల్ఎమ్93-320121 అచ్యుతాపురం గ్రంథాలయంలో పిల్లలకు ఆంగ్లంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో పిల్లలకు ఆంగ్ల వ్యాకరణంపై రిసోర్స్ పర్సన్ ఉపాధ్యాయుడు మారిశెట్టి వెంకటప్పారావు అవగాహన కల్పించారు. వేసవి శిబిరంలో భాగంగా హాజరైన విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించేందుకు మెలకువలు నేర్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, ఎస్.సీతారామమూర్తి తెలుగు పదాలు నేర్పించడం, ఇంగ్లిష్ చదివించడం, వి.లక్ష్మణరావు మ్యాథ్స్ చెప్పారు. అనంతరం వీక్లీ పోటీలో భాగంగా సీనియర్స్‌కి భారతదేశ మ్యాప్‌లో రాష్ట్రాలు, నదులు, సరిహద్దులు గుర్తించుట పోటీలు నిర్వహించారు. జూనియర్స్‌కి జాతీయ జెండాపై డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు.

నక్కపల్లి కూడలిలో సిగ్నల్ వ్యవస్థ అత్యవసరం


వీసం రామకృష్ణ

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి జాతీయ రహదారిపై ఆర్‌టీసీ కాంప్లెక్స్ కూడలిలో సిగ్నల్స్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్‌టీసీ కాంప్లెక్స్ కూడలి చాలా ప్రమాదకరంగా మారిందన్నారు. ఎస్.రాయవరం మండలం నుంచి పెట్టుగోళ్లపల్లి, నక్కపల్లి మండలం బోదిగల్లం, అప్పల పాయకరావుపేట, పెద దొడ్డిగల్లు, చినబోదిగల్లం, సీతంపాలెం, రాజీవ్‌నగర్, వెంకటనగర్ కాలనీ ప్రాంతాల నుంచి వచ్చేవారు, అలాగే జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు కాంప్లెక్స్ కూడలిలో యూటర్న్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే వారు కూడా ఇదే జంక్షన్‌లో మారి రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లోకి బస్సులు వెళ్లకపోవడంతో తుని, రాజమండ్రి, విజయవాడ, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు, అనకాపల్లి, విశాఖపట్నం వైపు వెళ్తే వారు ఈ కూడలిలోనే రోడ్డుపై వేచి ఉంటూ బస్సులు ఎక్కాల్సి వస్తోందన్నారు. రోడ్లపైనే షాపుల ముందు ద్విచక్ర వాహనాలను పార్క్ చేయడం వల్ల ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోందన్నారు. రోడ్డు క్రాస్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు కూడలిలో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త గణేష్‌కు ఘన నివాళి


గణేష్ మృతదేహానికి అంజలి ఘటిస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: రైలు ప్రమాదంలో మృతి చెందిన కరోతి గణేష్ మృతదేహానికి సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అంజలి ఘటించారు. తాడేపల్లిగూడెంలో జరిగిన ప్రమాదంలో ఉమ్మలాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గణేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. గణేష్ మృతదేహం ఉమ్మలాడకు చేరుకోవడంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ వెళ్లి నివాళులర్పించారు. గణేష్ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


దార్లపూడి వరాహ నది ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం: అనుమతులు లేకుండా వరాహ నదిలో ఇసుక తీస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జె.రమేష్‌బాబు హెచ్చరించారు. దార్లపూరి శివారు వరాహనది నుంచి నిత్యం 'యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా'అనే శీర్షిక సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. ఈ మేరకు సోమవారం వరాహ నది పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఇసుక రవాణా జరగకుండా చూడాలని స్థానిక వీఆర్వోను ఆదేశించారు. అలాగే కొత్తపోలవరంలో గ్రావెల్ తరలింపు ప్రాంతాలపై నిఘా పెట్టాలని ఆ గ్రామ రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

పింఛన్‌లు మంజూరు చేయాలని వినతి


పింఛన్‌ల కోసం ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న గణపర్తి మహిళలు

మునగపాక: అర్హులైన తమకు పింఛన్‌లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని గణపర్తికి చెందిన పలువురు మహిళలు ఎంపీడీవో ఎం.ఉషారాణికి వినతి అందజేశారు. అన్ని అర్హతలు ఉన్నా ఇంత వరకు కొత్త పింఛన్‌లు మంజూరు చేయకపోవడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారంటూ సర్పంచ్ చదరం నాయుడు, మాజీ సర్పంచ్ పిట్టా అప్పారావు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో విచారణ జరిపి అర్హులైన మహిళలకు పింఛన్‌లు అందేలా చూడాలన్నారు.

నేడు పైడిమాంబ పండగ

మునగపాక: మండలంలోని ఒంపోలులో మంగళవారం పైడిమాంబ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. రాత్రి కి గ్రామంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

పాల్తేరు హైస్కూల్‌లో సామగ్రి ధ్వంసం


ధ్వంసమైన ఫ్యాన్లను పరిశీలిస్తున్న ఎంఈవో రమేష్‌బాబు

పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పలువురు విద్యార్థులు సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఎంఈవో జి.రమేష్‌బాబు తెలిపారు. పాఠశాలలో ఈ నెల 2న కొందరు విద్యార్థులు గదుల్లో ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు, కరెంటు వైర్లు, తాగునీటి పైపులను పాడు చేశారన్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థులను మందలించామని, విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పగా.. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహిస్తామని హామీ ఇచ్చారని ఎంఈవో తెలిపారు.

'వర్ధమాన్ పరిశ్రమలో కార్మికుల శ్రమ దోపిడీ'



గేటు బయట పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : వర్ధమాన్ పరిశ్రమలో కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు ఆరోపించారు. అధిస్థాన్(బ్రాండిక్స్) పరిశ్రమ గేటు బయట వర్ధమాన్ కార్మికులు ఉదయం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఆందోళన చేశారు. వారికి సీఐటీయూ నాయకులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా పరిశ్రమ కార్మికుల శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. యాజమాన్యం రాకేష్, వినీత్ కార్మికుల్ని వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఓవర్ టైమ్ పని చేసిన కార్మికులకు భోజనం, రవాణా సదుపాయాలు కల్పించాలని కోరారు. సెలవులు, ఉద్యోగ భద్రత, స్కూల్ పిల్లలకు బ్యాగ్‌లు, స్కాలర్‌షిప్‌లు, యూనిఫాం, మెటర్నిటీ లీవ్‌లు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

అర్హులకు దక్కని 'మత్స్యకార భరోసా'


పూడిమడక సచివాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు, సంఘ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : పూడిమడక మత్స్యకారుల్లో అర్హులైన పలువురికి మత్స్యకార భరోసా దక్కలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఉమ్మిడి జగన్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మత్స్యకారులతో కలిసి గ్రామ సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 200 మంది అర్హులైన మత్స్యకారులకు భరోసా అందనీయకుండా కూటమి నాయకులు అడ్డుకున్నారన్నారు. అర్హులైన మత్స్యకారులకు వారం రోజుల్లో భరోసా నగదును ఖాతాల్లో వేయకుంటే మత్స్యకారులతో కలిసి భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా మత్స్యకార నాయకులు మేరుగు చినరాజులు, ఉమ్మిడి అప్పారావు, అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలతో అనర్థం


యలమంచిలిలో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

యలమంచిలి రూరల్ : దేశంలో, రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని సీపీఐ నేతలు అన్నారు. సోమవారం సాయంత్రం యలమంచిలిలోని గుర్రప్ప కల్యాణ మండపం ఆవరణలో సీపీఐ జిల్లా మహాసభల్లో భాగంగా సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలున్నా స్థానిక యువతకు మంచి ఉద్యోగావకాశాలు కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చి,రుణాల మాఫీ చేస్తున్నారని ఆరోపించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజ్జల ఈశ్వరయ్య,మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు,జిల్లా కార్యదర్శి బీవీ రమణ,జిల్లా సహాయ కార్యదర్శి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.